క్లుప్తంగా

పౌష్టికాహారం తీసుకోవాలి



సిరికొండ: ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలని, దానితోనే ఆరోగ్యానికి మేలు అని మండల వైద్య ఆరోగ్య శాఖ అధికారి అరవింద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం కోసం పలు సూచనలు, సలహాలు తెలిపారు. తహసీల్దార్ రవీందర్‌రావు, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్లు ప్రియదర్శిని, సరిత, హెల్త్ సూపర్‌వైజర్ తబిత, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక వేలంపాట



జక్రాన్‌పల్లి: మండలంలోని మనోహరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం బహిరంగ ఇసుక వేలంపాట నిర్వహించారు. తహసీల్దార్ కిరణ్మయి, ఆర్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేలంపాట ఏర్పాటు చేశారు. వేలంలో మనోహరాబాద్ గ్రామానికి చెందిన కుడల చిన్న గంగారాం రూ.1,21,500 పాట పాడి ఇసుకను దక్కించుకున్నారు. సుమారు 58 ట్రాక్టర్లు, 174 క్యూబిక్ మీటర్లు ఇసుక డంప్ ఉంటుందని అధికారులు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నిజామాబాద్‌రూరల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ యూనిట్-3 వలంటీర్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల విద్యార్థులు మండలంలోని గుండారం గ్రామంలో గత రెండు రోజులుగా ఎన్ఎస్ఎస్ శిబిరం ఏర్పాటు చేసి స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం గ్రామంలో ఉన్న రామాలయ పరిసరాలను శుభ్రపరిచి శ్రమదానం చేశారు. అనంతరం ప్రత్యేక శిబిరంను కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీరామ్, రమేష్‌గౌడ్ సందర్శించి సామాజిక శాస్త్రాల ప్రాముఖ్యతను, రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరించారు. శిబిరంలోని వలంటీర్లకు మెహందీ పోటీలు నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ సునీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు పంటనష్ట పరిహారం అందించాలి



ఇందల్వాయి: అకాల వర్షాలకు పంటలు దెబ్బతినడంతో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ పేర్కొన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లె, నల్లవెల్లి గ్రామాల్లో వడగళ్ల వానకి దెబ్బతిన్న పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వరి పైరు పూర్తిగా దెబ్బతిన్నదని, వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక అందించాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నాయిడి రాజన్న, ఉపాధ్యక్షుడు కన్నెచిన్ను, నాయకులు సక్కి సత్యనారాయణ, మనోహర్, రైతులు ఉన్నారు.

ఘనంగా అంబేడ్కర్ సేవాదివస్

మోపాల్: మండలంలోని మోపాల్, మంచిప్ప జెడ్పీహెచ్ఎస్‌తోపాటు మోపాల్ కేజీబీవీల్లో సోమవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ సేవా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బట్టు బద్రినాథ్ ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్, రాజ్యాంగం గురించి విద్యార్థులకు వివరించారు. అంబేడ్కర్ జీవితచరిత్రను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని, రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జిల్లా అధ్యక్షురాలు పరిశి కృష్ణవేణి, జిల్లా బాధ్యులు అంబటి నర్సయ్య, మోపాల్ హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, నరేష్, శోభ, గంగయ్య, శ్యామలత, శ్రీనివాస్, వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

నేడు పలు మండలాల్లో ఎమ్మెల్యే పర్యటన

డిచ్‌పల్లి: రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల్లో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మంగళవారం పర్యటించనున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షంతో జరిగిన పంట నష్టాన్ని ఆయన పరిశీలిస్తారు. పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వారిని పరామర్శించనున్నట్లు డిచ్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పన్ను చెల్లించకుంటే సీజ్

- ఇప్పటికే మున్సిపల్ కాంప్లెక్సుల్లో మడిగెలకు తాళాలు
- ఆస్తిపన్ను వసూళ్లకు అధికారుల ప్రత్యేక కార్యాచరణ

నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్నులు చెల్లించని వారిపై మున్సిపల్ అధికారులు సీజ్‌ల పేరిట చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పన్ను చెల్లించని పలువురి దుకాణాలను అధికారులు సీజ్ చేశారు. అలాగే వందశాతం పన్ను వసూళ్ల కోసం ప్రత్యేక ప్రణాళికతో అధికారులు ముందుకువెళుతున్నారు.



వసూళ్ల కోసం నగరంలో పర్యటిస్తున్న డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, ఆర్వో నరేందర్



పన్ను చెల్లించలేదని ఖలీల్‌వాడీలోని మున్సిపల్ కాంప్లెక్సులో ఓ దుకాణాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

నిజామాబాద్‌నాగారం: మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్నుల వసూళ్ల కోసం కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారు ల వరకు ఉరుకులు.. పరుగులు తీస్తున్నారు. నిత్యం ఉదయం 7గంటల నుంచే ఆస్తి పన్ను వసూళ్ల కోసం అధికారులు, సిబ్బంది నగరంలోని దుకాణాలు, ఇంటింటికి తిరుగుతున్నారు. ఎవరెవరు బకాయిలు చెల్లిస్తాలేరో జాబితా పట్టుకోని వెళుతున్నారు. ఇప్పటికే ఖలీల్‌వాడీలోని మున్సిపల్ కాంప్లెక్సులో ఉన్న వ్యాపారులు పన్నులు చెల్లించకపోవడతో సీజ్ చేశారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు..

కార్పొరేషన్ రిపోర్ట్

ఇప్పటి వరకు ఆస్తి పన్నులను రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ బ్రతిమిలాడుతు వసూళ్లు చేశారు. బకాయిలు ఉండి కూడా పన్నులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తే నేరుగా సీజ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికే ఖలీల్‌వాడీలోని మున్సిపల్ కాంప్లెక్సు రూ. 10లక్షల వరకు ఆస్తి పన్నులు చెల్లించాల్సి ఉన్నా నిర్లక్ష్యం చేయడంతోనే సోమవారం సీజ్ చేశారు. నగరంలోని గంజ్‌కమాన్ వద్ద ఓ ప్రైవేట్ దుకాణం కూడా రూ. 3లక్షల 50వేలు చెల్లించడంలో నిర్లక్ష్యం చేయడంతో సాయంత్రం సీజ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. సదరు దుకాణదారుడు చెక్కు ఇచ్చి పోవడంతో సీజ్ ఆగిపోయింది. ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే సీజ్ చేస్తామని అధికారులు ఆదేశాలను ఇస్తున్నారు.

టార్గెట్ రూ.42 కోట్లు

నిజామాబాద్ నగరంలో 60 డివిజన్లు, 84వేల నివాసాలు, 4లక్షల జనాభా ఉంది. పన్ను టార్గెట్ రూ. 42 కోట్లు కాగా.. ఇప్పటి వరకు రూ. 35కోట్ల వరకు ఆస్తి పన్ను వసూళ్లు చేశారు. వందశాతం పన్ను వసూలు కోసం నెల రోజుల నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. 49మంది రెవెన్యూ సిబ్బంది నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు పన్నులు వసూలు చేయడానికి తిరుగుతున్నారు. ప్రత్యేకంగా డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, ఆర్ఓ నరేందర్‌లు కార్యాచరణ రూపొందించుకొని ముందుకు వెళ్లుతున్నారు. నగరంలో 35వేల మందికి ఎస్ఎంఎస్ ద్వారా ఆస్తి పన్నులు చెల్లించాలని ఫోన్‌లకు సమాచారం అందించారు. వడ్డీలపై 90శాతం వెసులుబాటు కల్పించడంతో మరింత అవగాహన కల్పిస్తు వసూళ్లు రాబడుతున్నారు.

ప్రతి ఒక్కరూ పన్ను చెల్లించాలి

ఆస్తి పన్ను బకాయిల విషయంలో సీరియస్‌గా ఆదేశాలు ఇచ్చాం. కచ్చితంగా ప్రతి ఒక్కరూ ఆస్తి పన్నులు చెల్లించాలి. నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి పన్నులు ఉపయోగపడుతాయి. ఎవరైనా సరే బకాయిలు చెల్లించకుండా ఉంటే సీజ్ చేయాలని ఆదేశాలు ఇచ్చాను. అవసరమైతే నేనే రంగంలోకి దిగుతున్నాను.

– రాజేంద్రకుమార్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, నిజామాబాద్

నేటి చిత్రం..



పెద్దబజార్‌లో వాహనాల రద్దీ

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారమేదీ?

నిజామాబాద్ నగరంలోని పెద్దబజార్ చౌరస్తా వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రద్దీతోపాటు రోడ్లపైనే వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ సమస్య వస్తోంది. ఇక్కడ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమిస్తే సమస్యకు పరిష్కారం లభించినట్లవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

అవినీతి లేకుండా ప్రధాని మోదీ పాలన





నగరం నుంచి విజయ సంకల్ప సభకు తరలివెళ్తున్న ఎమ్మెల్యే, బీజేపీ నేతలు.. సిరికొండ నుంచి..

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- విజయ సంకల్ప సభకు తరలిన బీజేపీ శ్రేణులు



ధర్పల్లి నుంచి..

సుభాష్‌నగర్: పదేళ్లలో ప్రధాని మోదీ అవినీతి మచ్చ లేకుండా సుపరిపాలన అందిస్తున్నారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జగిత్యాల్‌లో జరిగిన బీజేపీ విజయ సంకల్ప బహిరంగ సభకు సోమవారం నగరం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. కేంద్రంలో మరోసారి బీజేపీ సర్కారును ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400 స్థానాలు సాధించడం పక్కా అని ధీమా వ్యక్తంచేశారు. ప్రపంచం మొత్తం భారత్ వైపు చూసేలా చేసిన ఘనత ప్రధాని మోదీకి దక్కిందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలు బీజేపీ కైవసం చేసుకుంటుందని, బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు మమతా ప్రభాకర్, నాయకులు కిషోర్, భాస్కర్, హరీష్‌రెడ్డి, కార్యకర్తలు తరలివెళ్లారు.

సిరికొండ: జగిత్యాలలో నిర్వహించిన బీజేపీ విజయసంకల్ప సభకు సోమవారం మండలం నుంచి ప్రత్యేక వాహనాల్లో బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, బాబురావు, రంజిత్‌రెడ్డి, గోవింద్, లింబాద్రి, సతీష్, సాయాగౌడ్, శ్రీనివాస్, రవి, మారుతి, అజయ్, స్వామి తదితరులు వెళ్లారు.

ధర్పల్లి: జగిత్యాలలో ఏర్పాటు చేసిన బీజేపీ విజయసంకల్ప సభకు సోమవారం ధర్పల్లి నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. నాయకులు మహిపాల్ యాదవ్, కర్క గంగారెడ్డి, దాసు, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి/సిరికొండ/నిజామాబాద్ రూరల్/ఇందల్వాయి/మోపాల్: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. డిచ్‌పల్లి మండలంలో ఏర్పాటు చేసిన 8 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1,233 మంది విద్యార్థులకు గానూ 1,231 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఈవో రాజగంగారాం తెలిపారు. సిరికొండ మండలంలోని నాలుగు కేంద్రాల్లో 537 మంది విద్యార్థులకు అందరు పరీక్షకు హాజరయ్యారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని పరీక్ష కేంద్రాల్లో 233 మంది విద్యార్థులకు గాను 231 మంది విద్యార్థులు పరీక్ష రాసారు. ఇందల్వాయి మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 485 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మోపాల్ మండలంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 1113 మంది విద్యార్థులకుగాను 1112 మంది హాజరయ్యారని అధికారులు పేర్కొన్నారు. బోర్గాం (పి) ఏ, బీ కేంద్రాలను రాష్ట్ర పరిశీలకురాలు సరోజిని సందర్శించి పరిశీలించారు. గుండారం పరీక్ష కేంద్రాన్ని ట్రెయినీ ఐపీఎస్ చైతన్య, రూరల్ ఎస్సై మహేశ్ సందర్శించారు. తొలిరోజు ఉదయాన్నే 8.30 గంటల కల్లా విద్యార్థులు తమకు కెటాయించిన పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకుని హాల్ టికెట్ నెంబర్లను సరిచూసుకున్నారు. 9 గంటలకు ఇన్విజిలేటర్లు విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపించారు. 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష కొనసాగింది. పరీక్ష కేంద్రాలను డీఈవో దుర్గాప్రసాద్, జిల్లా స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇన్విజిలేటర్లకు, సీఎస్, డీవోలకు సూచించారు.



ధర్మారం(బి) జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు







పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నెంబర్లను సరిచూసుకుంటున్న విద్యార్థులు.. విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు.. సిరికొండలో..

29న 'చందనాగ్ని' కవితా సంపుటి ఆవిష్కరణ సభ

నిజామాబాద్ సిటీ: నగరంలోని హరిచరణ్ మార్వాడి విద్యాలయంలో ఈ నెలా 29న వీపీ చందన్‌రావు వారి 'చందనాగ్ని' కవితా సంపుటి ఆవిష్కరణ సభ నిర్వహించనున్నట్లు హరిదా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఘనపురం దేవేందర్, ప్రధాన కార్యదర్శి డా కాసర్ల నరేష్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సాహిత్య ప్రియులందరూ తరలిరావాలని వారు కోరారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	67,000	వెండి (కిలో)	78,000
22 క్యారెట్స్	61,620		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)


	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	45	60
బెండకాయ	50	70	పచ్చిమిర్చి	40	70
జీరకాయ	40	60	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
జిల్లేసుకాయ	30	60	గోజగడ్డ	30	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	50	70
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	35	60	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ప్రేమలు (తెలుగు) - 1.30, 7.30, గామి (తెలుగు) - 4.30, 10.30
స్క్రీన్-2	రజాకార్ (తెలుగు) - 10.40, భీమా (తెలుగు) - 1.40, 4.30, 7.40 యోధ (హిందీ) - 10.40
స్క్రీన్-3	రజాకార్ (తెలుగు) - 1.30, 4.30, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	యోధ (హిందీ) - 10.10, 1.10, 7.10, 10.10, పరతులు వర్తిసాయి - 4.10
స్క్రీన్-2	ప్రేమలు - 4.45, రజాకార్(తెలుగు) - 10.20
స్క్రీన్-3	గామి (తెలుగు) - 10.25, 7.20 సైతాన్ (హిందీ) - 1.35 లంబసింగి (తెలుగు) - 4.35, బస్తర్ (ది నక్సల్ కథ) 10.30
స్క్రీన్-4	తంత్ర (తెలుగు) - 10.30 బస్తర్ (ది నక్సల్ కథ) 1.25, భీమా (తెలుగు) 4.15, సైతాన్ (హిందీ) - 7.20, 10.30
దేవి	ప్రేమలు (తెలుగు)
నటరాజ్	తంత్ర (హిందీ)
లలితామహల్	భీమా (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)

సంక్షిప్తం

నేడు గడ్కోల్‌లో వైద్య శిబిరం



సిరికొండ: మండలంలోని గడ్కోల్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ల రామకృష్ణ తెలిపారు. గడ్కోల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేస్ ఫౌండేషన్ సహకారంతో క్యాన్సర్ రోగ నివారణ కోసం నేడు గడ్కోల్, రేపు రావుట్ల గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు దామోదర్, రమేష్, లింబాద్రి, అనీస్, కిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కళాశాలలో సోమవారం కామర్స్, బిజినెస్, అడ్మిస్ట్రేటివ్ విభాగం ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషన్ ఆధ్వర్యంలో ఫెయింట్ యువర్ డ్రీమ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రణాళిక బద్ధంగా వాటిని సాధించడానికి నిరంతర అభ్యసం, కృషి ఉండాలన్నారు. లెక్చరర్లు సత్య హరిప్రసాద్, రంజిత, వేణుప్రసాద్, జ్యోతి, లింగన్న, సుమలత, రజిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మానాల మోహన్‌రెడ్డికి సన్మానం



సిరికొండ: డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఇటీవల రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం జిల్లా కేంద్రంలో మానాలను కలిసి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. నాయకులు బండారి నరేష్, చెలిమెల నర్సయ్య, బచ్చు పురుషోత్తం, దావీద్, ప్రదీప్, సోను తదితరులు ఉన్నారు.

మున్సిపల్ డీఈ సరెండర్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపల్ డీఈ లింగంపల్లి శివానందంను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో సరెండర్ చేస్తూ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం కలెక్టరేట్‌లో తాగునీటిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో డీఈపై ఫిర్యాదులు అందడంతో సరెండర్ చేసినట్లు తెలిసింది.

బెల్ట్ షాప్‌పై దాడి

వర్ని: మండలంలోని పులి క్యాంప్‌లో ఉన్న బెల్ట్‌షాప్‌పై పోలీసులు సోమవారం దాడి నిర్వహించారు. కిరాణషాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. ఈ దాడిలో రూ. 30 వేలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం..

నృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ధర్పల్లి: మండల శివారులోని మద్దుల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయాన్ని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నాయకులు అరికెల నర్సారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తనవంతుగా ఆలయానికి విరాళాలు అందజేసిన నర్సారెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. చెలిమెల నర్సయ్య, లక్ష్మయ్య, రమేష్‌గౌడ్, రాకేష్, నరేష్, రత్నాకర్, రాజేందర్ పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరాలయంలో హరికథ గానం



నిజామాబాద్ సిటీ: నగరంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మహత్యం, హరికథ గానం కార్యక్రమం నిర్వహించారు. దేవాదాయ, ధర్మదాయశాఖ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలా సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. హరికథ గాయకుడు చిరంజీవాచార్యులు సత్యనారాయణ స్వామి వ్రత మహత్యంపై హరికథ గానం వినిపించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

నిజామాబాద్ రూరల్ పాస్టర్స్ అసోసియేషన్..



డిచ్‌పల్లి: మండలకేంద్రంలోని బెయేర్షెబా చర్చిలో సోమవారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ (ఎన్ఆర్‌పీఏ) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ ఇ జెకర్యా ఆనంద్ తెలిపారు. అధ్యక్షుడిగా మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆమోస్, ప్రధాన కార్యదర్శిగా బాలస్వామి, కోశాధికారులుగా రెవరెండ్ ఏ దినక్, టి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా రెవరెండ్ స్టీవెన్ కుమార్, రెవరెండ్ డి అబ్రహం, రెవరెండ్ కే హనోక్, డేవిడ్, డి సామ్యూల్, ఏ సుధీర్, రెవరెండ్ థామస్, సంయుక్త కార్యదర్శులుగా దేవదాస్, జేమ్స్, ఆర్గనైజయింగ్ కార్యదర్శులుగా బ్రదర్ రాబర్ట్ వాసా, బ్రదర్ జీ అబ్రహం, బ్ర.ఎబినేజర్, కార్యవర్గ సభ్యులుగా ఫెరెస్ ఆశీర్వాదం, జ్ఞానందం, ప్రకాష్, యోహాను, రెవరెండ్ యేసుకుమార్, డి మోషే, యేసురత్నం ఎన్నికయ్యారు. నూతన కమిటీని సభ్యులు సత్కరించారు.